క్లుప్తంగా

'గృహలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న శ్రీనివాస్

జమ్మికుంట: మున్సిపాలిటీ పరిధి, మండలంలోని గృహలక్ష్మి దరఖాస్తులను అధికారులు గురువారం పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని 30 వార్డుల నుంచి 1,844 మంది దరఖాస్తు చేసుకోగా 689, మండలం నుంచి 2,998 మంది దరఖాస్తు చేసుకోగా 368 దరఖాస్తులను ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు.. గృహలక్ష్మి పథకం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీవో కల్పన, ఎంపీవో సతీశ్‌కుమార్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పదండి పట్టణంలో

చొప్పదండి: పట్టణంలోని ఆరోవార్డులో గృహలక్ష్మి దరఖాస్తుదారులను మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ పరిశీలించారు. మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, కౌన్సిలర్ గంగరాజుతో కలిసి దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. వెంట వార్డు అధికారి స్వర్ణ, గోపాల్, పవన్, తదితరులున్నారు.

సన్మానం



సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట వైద్యశాల సిబ్బంది అరుణ, ఆశా వర్కర్ హెప్సిబాలు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులను అందకోవడంతో గురువారం వారిని పద్మశాలీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక కమలాకర్, జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఐత శ్వేత, గీతాంజలి పాఠశాల కరస్పాండెంట్ గుర్రం రాజశేఖర్‌గౌడ్, సంఘం నాయకులు బుదారపు కార్తీక్, పెంటి ఆంజనేయులు, అంజమ్మ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల శ్రమదానం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామం ఎస్సారెస్పీ కాలువ పక్కన ఉన్న ప్రదేశాలను గురువారం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు పునీత్‌సాగర్ ప్రోగ్రాంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ అధికారి కల్లెం రవీంద్రబాబు మాట్లాడుతూ.. విద్యార్థులకు సమాజంలో ఉన్న ప్రకృతి వనరులపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో రేషన్‌షాపు

రామడుగు: మండలంలోని మోతె గ్రామ పరిధిలోని కొత్తపల్లిలో గురువారం తాత్కాలిక రేషన్ షాపును సర్పంచ్ అంబటి నారాయణ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం శివారు గ్రామాల్లో ప్రజల ఇబ్బంది దృష్ట్యా తాత్కాలిక రేషన్ షాపులను ఏర్పాటు చేస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదగోని మహేశ్‌తో పాటుగా గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్



ప్రచారం చేస్తున్న నాగిశేఖర్

గంగాధర: గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని మండలంలోని మధురానగర్ చౌరస్తాలో గురువారం నాయకులు నాగి శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ అధి కారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాలను వి వరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నర్సాగౌడ్, మహేశ్, నాగేంద్రాచారి, మల్లికార్జున్, రవీందర్, ప్రేమ్‌సాగర్‌రెడ్డి ఉన్నారు.

రైతులకు అండగా సీఎం కేసీఆర్

వీణవంక: సీఎం కేసీఆర్ రైతులకు అండగా నిలుస్తున్నారని, రైతుల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సిద్దపల్లి మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలో మాట్లాడారు. రుణమాఫీ ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని, వానాకాలం పెట్టుబడి ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమయిందని వివరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని, దేశ రాజకీయాలను శాసించే వ్యక్తి కేసీఆర్ అని అన్నారు.

ఎవరి వాదనలు వారివే..!

- వివాదాస్పదమవుతున్న సెంట్రల్ లైటింగ్ నిర్మాణం
- అంబేడ్కర్ చౌరస్తాలో నిలిచిన పనులు
- ఆందోళన బాటలో గృహ యజమానులు
- సెంటర్ మార్కింగ్‌లో శాస్త్రీయతపై అనుమానాలు



అంబేడ్కర్ చౌరస్తాలోని వివాదాస్పద రోడ్డు

చొప్పదండి: పట్టణంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా మురుగుకాలువల నిర్మాణం వివాదాస్పదమైంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న యజమానులు ఎవరి వాదనలు వారు వినిపిస్తుండటంతో రెండు రోజులుగా యంత్రాల సాయంతో కాలువ మట్టి తవ్వకం నిలిచిపోయింది. రెండు వైపుల్లో ఒక వైపు పట్టణానికి చెందిన ప్రజాప్రతినిధి నివాస గృహం, ఆ వైపు తక్కువ విస్తీర్ణంలో మురుగుకాలువ నిర్మిస్తారంటూ సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకోవడంతో వివాదం కాస్త ముదిరింది.

నిలిచిన పనులు

అంబేడ్కర్ చౌరస్తా నుంచి బుధవారం సాయంత్రం చేపట్టిన మట్టితవ్వకం పనులను నిలిపివేశారు. గురువారం ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌కు స్థానికులు గోడు వెల్లబోసుకున్నారు. నిబంధనల ప్రకారం పట్టణంలో ఆరునెలల క్రితం ఏర్పాటు చేసిన సెంటర్ మార్కింగ్ ప్రకారం ఇరువైపులా యాభై ఫీట్ల చొప్పున మురుగుకాలువ నిర్మించినట్టే తమ గృహాల వద్ద కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమవైపు ఆరవై ఫీట్లు, అపోజిట్ వైపు నలభై ఫీట్ల మేర మురుగుకాలువ నిర్మించాలనే ప్రతిపాదనలను ఖండించారు. ఈ మేరకు అధికారులు కూడా రోడ్డును పరిశీలించారు.

శాస్త్రీయత ఏదీ..

సెంట్రల్ లైటింగ్ నిర్మాణంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా సెంటర్ మార్కింగ్ నుంచి 55 అడుగుల చొప్పున మార్కింగ్ చేశారు. ఇది విస్మరించి ప్రస్తుతం వంద అడుగుల మేర మాత్రమే రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఉన్న వంద అడుగుల రోడ్డుకు ఇరు వైపులా సెట్ బ్యాక్ వదిలి నిర్మాణం చేయాలని మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. ఇప్పుడు అనేక చోట్ల గృహాలను సెంటర్ నుంచి యాభై అడుగుల వరకు నిర్మించినట్లు తేటతెల్లం అవుతుండటం, సెట్ బ్యాక్ స్థలం వదలకపోవడం, అప్పటి అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన తారురోడ్డు 33 అడుగులు ఉండాల్సింది, ఒక్కో చోట 33 నుంచి 40 అడుగుల వరకు ఉంది. దీంతో రోడ్డుకు ఒకవైపు యజమానులకు కలిసివస్తుండగా, మరో వైపు గృహ యజమానులకు నష్టం జరుగుతోందని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే డస్టు వాడటం, క్యూరింగ్ తగినంత లేదని, సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందని విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా నిబంధనల ప్రకారం రోడ్డు నిర్మించాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

మార్కింగ్ ప్రకారం పనులు



పట్టణంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనుల్లో ఇంతకు ముందే ఆర్అండ్‌బీ అధికారులు ఇచ్చిన సెంటర్ పాయింట్ నుంచి ఇరువైపులా యాభై ఫీట్ల మేర రోడ్డును అభివృద్ధి చేస్తున్నాం. మురుగు కాలువ నిర్మాణం ఎక్కడా ఆగదు, అలాగే రోడ్డు విస్తరణ తగ్గదు, కాంట్రాక్టర్‌కు కొన్ని బిల్లులు రావాల్సి ఉంది అందుకే పనులు ఆలస్యమవుతున్నాయి.

– శాంతికుమార్, మున్సిపల్ కమిషనర్

దశాబ్ది సంపద వనాల పరిశీలన



మానకొండూర్: సంపద వనం వద్ద అధికారులు

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లిలోని దశాబ్ది సంపద వనాన్ని సీఆర్డీఎస్‌పీఎం నర్సింగరావు, అడిషనల్ డీఆర్డీవో సంధ్యారాణి, ఏపీడీ కృష్ణ గురువారం సందర్శించారు. సంపద వనాల్లో ఎత్తైన మొక్కలు పద్ధతి ప్రకారం నాటారని, సంపద వనం మేకలకు ఆహారం కాకుండా చుట్టూ కంచె వేయడం మంచి పరిణామమని అన్నారు. సంపద వనంలో పెంచిన మొక్కలు, వ్యయం తదితర వివరాలు బోర్డుపై నమోదు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మొక్కలకు సకాలంలో నీరు అందించి మొక్కల పెరుగుదలకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సరిత రాఘవరెడ్డి, ప్లాంటేషన్ మేనేజర్ సత్యనారాయణ, క్వాలిటీ కంట్రోలర్ శ్రీధర్, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, జేఈ అంజయ్య, టీఏ మమత, కార్యదర్శి స్వర్ణలత, ఫీల్డ్‌అసిస్టెంట్ సునిత పాల్గొన్నారు.

అధికారులను ప్రశంసించిన నర్సింగరావు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ సంపద వనం బాగుందని నర్సింగరావు అధికారులను ప్రశంసించారు. గురువారం సంపద వనాన్ని పరిశీలించి మొక్కల పెంపకం క్రమపద్ధతిలో చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రావు, అదనపుడీఆర్‌డీవో సంధ్యారాణి, ఏపీవో శారద, ఏపీడీ కృష్ణ, ఏఈ తిరుపతి తదితరులుఉన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



బీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: రైతుబీమా, రైతు బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలుపుతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. గురువారం మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రైతు చింత పంటి బాలయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.ఐదులక్షల రైతు బీమా చెక్కు అందజేశారు. గుండి, రాంచంద్రాపూర్ గ్రామాల్లో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ప్రమాదవశాత్తు మృతిచెందగా పార్టీ ప్రమాదబీమా కింద రూ. రెండు లక్షల చెక్కును కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు గంట్ల జితేందర్ రెడ్డి, గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ మామిడి తిరుపతి, చాడ ప్రభాకర్‌రెడ్డి, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడె ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, సర్పంచ్ చాడ ప్రసూన, గుండి మానస, ఎంపీటీసీ మద్దీ శ్యాం;' నాయకులు గంట్ల వెంకట్‌రెడ్డి, కలిగేటి లక్ష్మణ్, గుండి ప్రవీణ్, చాడ శేఖర్‌రెడ్డి, లంక మల్లేశం, పైండ్ల శ్రీనివాస్, మల్లేశం నాయకులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు మరిన్ని సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జెడ్పీటీసీ, నాయకులు

చిగురుమామిడి: హుస్నాబాద్‌లో ముదిరాజ్ సంఘ భవనం, కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ హామీ ఇచ్చారు. గురువారం జెడ్పీటీసీ, ముదిరాజ్ మహాసభ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గీకురు రవీందర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు ఎమ్మెల్యేను హన్మకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముదిరాజ్‌లకు ప్రభుత్వం ఇప్పటికే పెద్దపీట వేసిందని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేయనుందని చెప్పారు. హుస్నాబాద్‌లో స్థలం కోసం ఇప్పటికే సిద్దిపేట కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ముదిరాజ్‌ల సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని జెడ్పీటీసీ తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ముదిరాజ్ సంఘం నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహాసభ అధ్యక్షుడు పెసరి రాజేశం, జిల్లా కార్యదర్శి తోట సతీష్, సర్పంచ్ వెంకటేశం, ముదిరాజ్ సహకార సంఘం అధ్యక్షుడు సంజీవ్, జక్కుల బాబు, మాజీ అధ్యక్షుడు కూన మహేందర్, కాశబోయిన నర్సయ్య పలువురు పాల్గొన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి

జమ్మికుంట: అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి, రేషన్‌కార్డులు, 57 ఏళ్లే నిండిన వారికి పింఛన్లు మంజూరు చేయాలని, రైతులకు కొత్త రుణాలు అందజేయాలన్నారు.జిల్లాల్లో పేరుకుపోయిన ధరణి సమస్యలు పరిష్కరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి శీలం అశోక్, కమిటీ సభ్యులు కొప్పుల శంకర్, దండుగారి సతీష్, బైరం సమ్మయ్య, శ్రీకాంత్, సాగర్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా



మానకొండూర్‌లో నాయకుల నిరసన

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట బీజేపీ నాయకులు గురువారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అర్హులైన పేదలందరికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం ఇండ్లులేనివారందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి మాట తప్పిందని, గృహలక్ష్మి పథకంతో కొత్తనాటకానికి తెరలేపడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన కింద మంజూరైన ఇండ్లను ప్రభుత్వం ఎందుకు కట్టివ్వడంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత పథకాలను అమలు చేస్తుందన్నారు.

శ్రావణమాస పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తిమ్మాపూర్: మండలంలోని ఇందిరానగర్ సాయిబాబా ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా గురువారం అర్చకుడు కిరణ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు బాబాను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

హుజూరాబాద్ ఎంపీడీవోగా జయశ్రీ

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి బదిలీ కాగా గురువారం టి. జయశ్రీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తానని, పెండింగ్ పనులను ప్రణాళికతో పూర్తి చేస్తామని తెలిపారు.

ఇల్లందకుంట తహసీల్దార్‌గా రాణి

ఇల్లందకుంట: ఇల్లందకుంట తహసీల్దార్‌గా పోలెపాక రాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఇక్కడ పని చేసిన గట్ల రమేశ్‌బాబు గంగాధర మండలానికి బదిలీ అయ్యారు. తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

తహసీల్దార్ బదిలీ

గంగాధర: ఇటీవల గంగాధరకు బదిలీపై వచ్చిన తహసీల్దార్ కొండాల్ వెంకటశ్రావణ్‌కుమార్ కరీంనగర్ డీఏవో ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇల్లందకుంట తహసీల్దార్ జి. రమేశ్‌బాబును బదిలీ చేస్తూ కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్‌ను సన్మానించిన నాయకులు

శంకరపట్నం: ఇటీవల బదిలీపై వచ్చి విధుల్లో చేరిన తహసీల్దార్ అనుపమను అఖిలపక్షం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తినిశ్రీనివాస్‌గౌడ్, సయ్యద్‌ఆరీఫ్, రాజిరెడ్డి, పిట్టలసమ్మయ్య, సాబీర్, బుచ్చయ్య, వీరమల్లు, సమ్మయ్య పాల్గొన్నారు.

నియామకం

చొప్పదండి: మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన పెద్దెల్లి ప్రభాకర్‌ను బీఆర్‌ఎస్ మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గురువారం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమానికి చేస్తున్న కృషిని గ్రామాల్లో ప్రచారం చేయాలని సూచించారు. నియామకానికి సహకరించిన బీఆర్‌ఎస్ నాయకులకు ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

రామడుగు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 21వ తేదీ నుంచి దళిత బంధుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ కలిగేటి కవిత లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని కోరారు.

21న మందకృష్ణ సభ

శంకరపట్నం: మానకొండూర్‌లో 21న నిర్వహించే మందకృష్ణ సభను విజవంతంచేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు కోరారు. కేశవపట్నంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కవులు, కళాకారులు, మేధావులు, ఉపకులాలవారు పాల్గొనాలని సూచించారు. సమావేశంలో భూమయ్య, ఆంజనేయులు, దేవేందర్, సంపత్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

మా భూమి మాకు ఇప్పించండి



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

మానకొండూర్: నమ్మించి మేన మామ భూమి పట్టా చేసుకున్నాడని, మా భూమి మాకు ఇప్పించాలని మండలంలోని సదాశివపల్లికి చెందిన అన్నాడి తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులతో ఆవేదన వ్యక్తం చేశాడు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు. తల్లీ వజ్రమ్మ చనిపోతే తన పేరున 652/3/1, 653/సీ/1, 650/1/1, 652/2/1 సర్వే నంబర్లలో 2.18 ఎకరాల భూమిని పట్టా చేసుకోవడానికి తమ్ముడు రాజు, తండ్రి రాజన్న 2022 ఆగస్టులో స్లాట్ బుక్ చేసుకుంటే చెంజర్లకు చెందిన మేనమామ ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి మాయమాటలతో స్లాట్ బుకింగ్ రద్దు చేయించి భూమి కాజేశాడని ఆరోపించారు. భూమి అన్నదమ్ములు పంచుకోవాలని, తండ్రి పేరిట ఒక్కొక్కరు రూ.ఐదులక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని ఓ పెద్దమనిషి సమక్షంలో సూచించి ఆడబ్బులు తనవద్దే పెట్టుకున్నాడని, తన పేరిట ఎకరం తొమ్మిది గుంటల భూమి పట్టా అయిన తర్వాత శ్రీనివాస్‌రెడ్డి కుమారుడి పేరిట పట్టా చేసుకున్నాడని తెలిపారు. కాజేసిన భూమిని తిరిగి ఇప్పించాలని విలేకరుల సమావేశంలో వేడుకున్నాడు.

మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు యత్నం



చొప్పదండి: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మురుగుకాలువ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం చొప్పదండి నుంచి వెళ్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ కాన్వాయ్‌ని స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. మురుగుకాలువ పనులు నిబంధనల ప్రకారం చేపట్టాలని ఇప్పటికే గుర్తించిన మార్కింగ్ ప్రకారం డ్రైనేజీ నిర్మించాలని కోరుతూ కాన్వాయ్‌కి అడ్డుగా వెళ్లగా ఎస్కార్ట్ వాహనాలను రోడ్డు కిందకు దించి ఆగకుండా వెళ్లిపోయారు. ప్రతిరోజు రోడ్డు గుండా వెళ్లే మంత్రి తమ గోడు వింటాడని ఆశపడితే పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



మాట్లాడుతున్న డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి

మానకొండూర్: మంచి మార్కులతో భవిష్యత్‌కు అడుగు వేయాలని డీఐఈవో జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులను కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే గుర్తుంటుందని, అధ్యాపకులు బోధించిన పాఠాలు శ్రద్ధగా వినాలని, అనంతరం పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. పరీక్షలలో మంచి మార్కులు సాధించేలా, విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. జీకే, పోటీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి. ఆంజనేయరావు, అధ్యాపకులు శరత్, కరుణ, నజీమ, ఎ. రమేష్, టి. రమేష్, శ్రీనివాస్, లలిత, మంజుల, సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, నిరోషా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

గంగాధర: ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీపీయూఎస్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు, జిల్లా అధ్యక్షుడు కట్టా రాజేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తపస్ సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. 19న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ... పీఆర్‌సీ, ఐఆర్, డీఎలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీవో 317 ద్వారా ఉపాధ్యాయులకు సొంత జిల్లాల్లో అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజేశ్వర్‌రావు, జారతి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

తిమ్మాపూర్: మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు పని చేసేలా చూడాలని తిమ్మాపూర్ సర్కిల్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై ప్రమోద్‌రెడ్డి సూచించారు. ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్‌లో హాస్టళ్ల యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. విద్యార్థులు బయటకు వెళ్లినప్పుడు తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాలని సూచించారు. రాత్రి వేళ విద్యార్థులను బయటకు పంపించొద్దని ఆదేశించారు. హాస్టల్ వద్దకు ఎవరైనా వస్తే అనుమతి ఉంటేనే మాట్లాడే అవకాశం ఇవ్వాలని, విద్యార్థులు, తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు, ఇతర వివరాలు హాస్టల్ యజమానుల వద్ద ఉండాలని సూచించారు. పరిశుభ్రతను పాటించాలని, త్వరలో హాస్టళ్లను తనిఖీ చేస్తామన్నారు. సీసీ కెమెరాలు లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు..

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మహిళా, పిల్లల, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ, అలీంకో సంస్థ ఆధ్వర్యంలో ఉచిత బ్యాటరీ ట్రైసైకిళ్ల కోసం అర్హులైన లబ్ధిదారుల ఎంపిక శిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల దివ్యాంగులు పాల్గొనగా 51 మందిని అర్హులుగా ఎంపిక చేశామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సూపరింటెండెంట్ ఆర్‌ం శ్రీనివాస్, సిబ్బంది రాజలింగం, ఆదినారాయణ, ఐకేపీ సీసీ వాణిశ్రీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, టీచర్లు పద్మ, నిర్మల, విజయ తదితరులు పాల్గొన్నారు.